కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా ఆదివారం ఎల్లంపేట్ సబ్ స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవన్‌చందు తెలిపారు. ఎల్లంపేట్ పరిధిలోని అగ్రికల్చరల్ సర్వీసులకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఉచిత వైద్య సేవలు



ఘట్‌కేసర్: మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఉన్న నీలిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో పీర్జాదిగూడలోని మా ఫౌండేషన్ అనాథాశ్రమంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఫౌండేషన్‌లోని 30 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఈఓ నీలిమ, వైద్య బృందం పాల్గొన్నారు.

మల్కాజిగిరి నుంచి రెండు నామినేషన్లు

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గానికి రెండవ రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీకి చెందిన నాయకురాలు న్యాయవాది ప్రసన్ననాయుడు, తెలంగాణ ప్రజాజీవన రైతు పార్టీ తరఫున చుండి శోభన్‌బాబు నామినేషన్ దాఖలు చేశారు. ప్రసన్ననాయుడు జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో నేరెడ్‌మెట్ డివిజన్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.

సై.. నువ్వా.. నేనా..?

అన్ని పార్టీల్లో జోరు.. ప్రచారంతో హోరు..

- గెలుపే లక్ష్యంగా పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలు
- నామినేషన్ దాఖలు నుంచే ర్యాలీలకు సన్నద్ధం
- జాతీయ, రాష్ట్ర నేతలతో భారీ సభలకు ప్రణాళిక

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాజకీయ పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నాయి. అధికార, విపక్ష పార్టీల అభ్యర్థులు హంగూ ఆర్భాటాలతో నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఓవైపు నామినేషన్ల ఘట్టం.. మరోవైపు ప్రచార పర్వం ఊపందుకోవడంతో ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది. గతానికి భిన్నంగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఆత్మీయ సమ్మేళనాలు, సామాజికవర్గాల వారీగా సభలు, అపార్ట్‌మెంట్లలో గ్రూపు సమావేశాలకు ప్రాధాన్యం ఇస్తుండటం గమనార్హం. ఇక నుంచి ప్రచార ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారాలు, బహిరంగ సభలతో పాటు జాతీయ, రాష్ట్ర నేతల ఎన్నికల సభలతో ప్రచార పర్వం హోరెత్తనుంది.

బీఆర్‌ఎస్ దూకుడు..

మ్యానిఫెస్టో ప్రకటన నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల్లో గులాబీ నాయకులు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తున్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని మంత్రి మల్లారెడ్డి ఇప్పటికే రెండుసార్లు చుట్టేశారు. గ్రామాలు, పురపాలక సంఘాల్లో వార్డుల వారీగా ప్రత్యేక కమిటీలను నియమించి ప్రచార తీరుతెన్నులపై దిశానిర్దేశం చేస్తున్నారు. జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలను కాదని ఇతర నాయకులకు టికెట్లు ఖరారు చేసిన అధిష్టానం మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల ప్రచార ఇన్‌చార్జిగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును, ఉప్పల్ నియోజకవర్గానికి ఎన్నికల ప్రచార ఇన్‌చార్జిగా రావుల శ్రీధర్‌రెడ్డిని ప్రకటించగా, వారు అసమ్మతి



నాయకులు, కేడర్‌ను సమన్వయపరుస్తూ ముందుకెళ్తున్నారు. జిల్లాలో కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఓవైపు ప్రచార పర్వాన్ని కొనసాగిస్తూనే.. వారానికోసారి సమావేశాలు నిర్వహించాలని ముఖ్యనేతలు నిర్ణయించారు. మేడ్చల్‌లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ, ఉప్పల్ పరిధి మల్లాపూర్‌లో మంత్రి కేటీఆర్, మల్కాజిగిరిలో మంత్రి హరీష్‌రావు ఎన్నికల సభలు పూర్తవడంతో ప్రచారంలో మరింత వేగం పెంచారు.

వ్యూహాత్మకంగా కాంగ్రెస్

అభ్యర్థుల ఎంపిక ప్రకటన కాసింత ఆలస్యమైనా.. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ ఆచితూచి అడుగులు వేస్తోంది. జిల్లాలో ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మేడ్చల్ నుంచి తోటకూరి వజ్రేష్‌యాదవ్, మల్కాజిగిరి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కుత్బుల్లాపూర్ నుంచి కొలన్ హన్మంతరెడ్డి, కూకట్‌పల్లి నుంచి బండి రమేష్, ఉప్పల్ నుంచి ఎం.పరమేశ్వర్‌రెడ్డిని వ్యూహాత్మకంగా బరిలోకి దించింది. మేడ్చల్‌లో అధికార బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ద్వితీయ శ్రేణి నాయకులు చేరడంతో పాటు వారంతా సమన్వయంతో పనిచేస్తూ.. పాత, కొత్త నాయకులను కలుపుకొని ప్రచారం సాగిస్తున్నారు. కాంగ్రెస్‌లో చేరికలతోపాటు ప్రచార వేగాన్ని పెంచారు. ఆరు గ్యారంటీల సరికొత్త నినాదంతో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్తున్నారు.

బీజేపీలో ఇద్దరి అభ్యర్థిత్వాలు ఖరారు

భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఇప్పటి వరకు ఇద్దరి అభ్యర్థిత్వాలను మాత్రమే ప్రకటించింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, ఉప్పల్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్‌ను అధిష్టానం ప్రకటించింది. ప్రచార పర్వంలో కుత్బుల్లాపూర్ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ దూసుకుపోతుండగా, ఉప్పల్‌లో అభ్యర్థి ప్రభాకర్ ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. మిగిలిన మూడు మేడ్చల్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి స్థానాలకు అభ్యర్థులను బీజేపీ ప్రకటించాల్సి ఉంది.

24/7 కంట్రోల్ రూమ్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మీడియా సర్టిఫికెట్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) సెంటర్‌ను జిల్లా వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాశ్మీనా, బాలాసాహెబ్ బాపూరావుతో కలిసి ఆయన పరిశీలించారు. సోషల్ మీడియా, పెయిడ్ ఆర్టికల్స్, న్యూస్ రికార్డింగ్ అభ్యర్థులు యాడ్స్ సంబంధించి సర్టిఫికేట్లు తదితర వివరాలను వ్యయ పరిశీలకులకు వివరించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక, ఇతర మాధ్యమాల్లో వచ్చే రాజకీయ ప్రకటనలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. 24 గంటలు పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఎన్నికల శిక్షణకు హాజరు కాని వారిపై చర్యలు

ఎన్నికల నేపథ్యంలో శిక్షణ తరగతులకు హాజరు కాని అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం ఆయన రామంతాపూర్‌లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధులు, బాధ్యతలు పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్ముందు ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం తప్పకుండా ఎన్నికల శిక్షణ తరగతులకు హాజరు కావాల్సిందిగా సూచించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

– జిల్లా వ్యయపరిశీలకులు ప్రేమ్ ప్రకాష్ మీనా



సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్ వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాశ్ మీనా, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి వ్యయ పరిశీలకులు బాలా సాహెబ్ బాపూరావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులు, ఎఫ్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీవీటీ, ఎంసీసీ, టీమ్స్ ఎన్నికల విభాగం అధికారులతో ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ ఎంతో ముఖ్యమన్నారు. వ్యయ పరిశీలన బృందం అభ్యర్థుల వ్యయంపై షాడో రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. రోజువారి నిర్వహణపై రిజిస్టర్లు చేపట్టాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఎన్నికల వ్యయ పరిశీలకులకు సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా వ్యయ పరిశీలకులు బాలా సాహెబ్ బాపురావు, డీసీవో శ్రీనివాస మూర్తి, డీటీవో నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ టు బీజేపీ వయా కాంగ్రెస్

- బీజేపీ వైపు చూస్తున్న మేడ్చల్ నేత నక్క ప్రభాకర్‌గౌడ్
- ప్రభాకర్‌గౌడ్ కోసమే బీజేపీ అభ్యర్థి ప్రకటన పెండింగ్
- నాయకులు, కార్యకర్తల అభిప్రాయం తర్వాతే నిర్ణయం

మేడ్చల్: రాజకీయంలో పొద్దున ఓ పార్టీలో.. రాత్రికి మరో పార్టీలో ఉండటం నాయకుడి సహజ లక్షణం. ఆ పార్టీ అన్యాయం చేసిందని, ఈ పార్టీ టికెట్ ఇవ్వలేదని, మరో పార్టీ గౌరవం ఇవ్వలేదని, ఏదో ఒక సాకు చూపుతూ తన భవిష్యత్ కోసం, పార్టీల ద్వారా వచ్చే పదవుల కోసం ఏదో ఒక పార్టీలో చేరి రాజకీయ పబ్బం గడుపుకునే నేతలు ఎంతో మంది ఉన్న నేటి రాజకీయంలో మేడ్చల్ నియోజకవర్గ సీనియర్ రాజకీయ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ ఒకరుగా మారుతున్నారు. నెల రోజుల క్రితం వరకు బీఆర్‌ఎస్‌లో ఉన్న నక్క ప్రభాకర్‌గౌడ్ తన రాజకీయ గురువు మైనంపల్లి హన్మంత్‌రావు కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన గురువు వెంట బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ ఆశించినా అధిష్టానం టికెట్‌ను తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు కేటాయించింది. వజ్రేష్‌యాదవ్‌కు టికెట్ కేటాయించినా నక్క ప్రభాకర్‌గౌడ్ వజ్రేష్‌కు పూర్తి మద్దతు పలికి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ పర్యటనలు చేశారు. పార్టీ సమావేశాల్లో పాల్గొని తాను వజ్రేష్‌యాదవ్‌కు అండగా ఉంటానని తన అభిమానులు కాంగ్రెస్ వెంట నడవాలని పిలుపునిచ్చారు.



నక్క ప్రభాకర్‌గౌడ్

కాంగ్రెస్ మురిపెం మున్నాళ్లయినా..

కాంగ్రెస్ పార్టీలో నక్క ప్రభాకర్‌గౌడ్ చేరడంతో ఆ పార్టీకి కొంత నియోజకవర్గంలో బూస్ట్ లభించింది. నక్క ప్రభాకర్‌గౌడ్, అభ్యర్థి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జట్టుగా ఉండి క్యాడర్‌లో జోష్ నింపారు. వారం క్రితం వరకు కాంగ్రెస్‌లో బలంగా కనిపించిన నక్క ప్రభాకర్‌గౌడ్ తెర వెనుక ఉండిపోయాడు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండిపోతూ తన భవిష్యత్ కోసం బీజేపీ వైపు చూడటం మొదలు పెట్టాడు. దీంతో నక్క ప్రభాకర్ చేరాడని మురిసిపోయిన కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మురిపెం మున్నాళ్ల గానే మిగిలిపోయింది.

బీజేపీ మేడ్చల్ అభ్యర్థి ప్రకటన పెండింగ్ నక్క కోసమేనా..?

బీజేపీ మూడు విడతలుగా రాష్ట్రంలో అభ్యర్థులను ప్రకటించినా మేడ్చల్ అభ్యర్థిని పెండింగ్‌లో పెట్టింది. బీజేపీ మేడ్చల్‌లో మొదటి నుంచి మేడ్చల్‌లో ప్యారాచూట్ నాయకులపై ఆశలు పెట్టుకోవడంతో నక్కపై వల విసరగా ఆయన ఆ వలలో పడ్డట్టు సమాచారం. నక్క ప్రభాకర్‌గౌడ్‌కు మేడ్చల్ నుంచి రెండుసార్లు వివిధ పార్టీల నుంచి పోటీ చేసిన అనుభవం ఉండటం, సీనియర్ నాయకుడు, బలహీనవర్గాల నాయకుడు కావడంతో ఆయనను బరిలోకి దింపితే పార్టీకి లాభం చేకూరుతుందనే భావనతో బీజేపీ నక్క ప్రభాకర్‌గౌడ్ కోసం పావులు కదుపుతోంది. పార్టీ అభ్యర్థిని పెండింగ్‌లో పెట్టి నక్క ప్రభాకర్‌గౌడ్‌ను పార్టీలో చేర్పించుకుని అభ్యర్థిగా ప్రకటించి ఎన్నికల బరిలోకి దించాలని బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది.

డీసీసీ అధ్యక్ష పదవి ఇస్తామని చెప్పినా..

మేడ్చల్ నియోజకవర్గంలో దాదాపు 30 ఏళ్లుగా రాజకీయం చేస్తున్న నక్క ప్రభాకర్‌గౌడ్ ఎమ్మెల్యే మాత్రం కాలేకపోయారు. బొమ్మిరాసిపేట నుంచి శామీర్‌పేట్ జెడ్పీటీసీ వరకు రాజకీయం చేసినా ఆయన ఎమ్మెల్యే కాలేకపోయారు. 2014లో టీడీపీ తరఫున, 2018లో బీఎస్పీ తరఫున పోటీ చేసిన ఆయన తన లక్ష్యం ఎమ్మెల్యే కావడం మాత్రం చేరుకోలేకపోయారు. తాజాగా టికెట్ బీఆర్‌ఎస్ నుంచి ఆశించిన తన గురువు మైనంపల్లి కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో ఆశలు అడియాశలు అయ్యాయి. కాంగ్రెస్‌లో డీసీసీ అధ్యక్ష పదవి ఇస్తామని చెప్పినా ప్రకటన రాలేదు. దీంతో తాను ఎమ్మెల్యే అయ్యేదెన్నడో అని భావించి ప్రభాకర్‌గౌడ్ తన టార్గెట్‌ను చేరుకోవడం కోసం బీజేపీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచేందుకు రాజకీయం నడుపుతున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

చర్చలు జరిగాయి..

నక్క ప్రభాకర్‌గౌడ్‌ను బీజేపీలో చేర్చుకోవాలనే చర్చలు పార్టీలో జరిగాయి. ఆయన మేడ్చల్ బీజేపీ టికెట్ అడుగుతున్నారు. పార్టీలో నాయకులు, కార్యకర్తల అభిప్రాయం తీసుకున్న తర్వాతే నిర్ణయం ప్రకటిస్తాం. నక్క ప్రభాకర్‌గౌడ్ విషయంలో పార్టీ అధిష్టానంతో చర్చలు జరుగుతున్న మాట వాస్తవం.

– విక్రంరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

జాతీయ స్థాయి శతాధిక కవి సమ్మేళనానికి మేడ్చల్ కవి



కొండల్‌రావు

మేడ్చల్: కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించే జాతీయ స్థాయి శతాధిక కవి సమ్మేళనానికి మేడ్చల్ కవి ఎంపిక అయ్యారు. మేడ్చల్‌కు చెందిన ప్రముఖ కవి కవిశ్రేష్ఠ గుండవరం కొండల్‌రావు ఎంపికయ్యారు. కరీంనగర్‌లో భవాని సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయి శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నారు.

వైభవంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠ



కీసర: కీసరలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ మహోత్సవ ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో శనివారం బొడ్రాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని పండితులు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు వెంపటి ప్రభాకర్ శర్మ, సాయికిరణ్‌శర్మ, సందీప్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు బొడ్రాయి యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ మహాపూజ, బలిహారణం, పూర్ణాహుతి తదితర పూజలను నిర్వహించారు. సర్పంచ్ నాయకపు మాధురివెంకటేష్ దంపతులు, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా, ఉపసర్పంచ్ లక్ష్మణ్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్

బోడుప్పల్: ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన జీవన్‌సాగర్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటోందని నిర్వాహకులు నారాయణ వెల్లడించారు. పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలాంటో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్, జువెలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, స్టాయిల్స్ స్టాల్స్, డ్రైఫ్రూట్ స్టాల్స్, ఆల్ వెరైటీ ఫుడ్స్ స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అంతేగాకుండా అండర్ వాటర్ ట్యూనల్ ఆక్వేరియం మొదటి సారిగా పెట్టడం జరిగిందన్నారు. నీటి అడుగున సొరంగ ప్రదర్శన, రెండు వేల చేపలతో ప్రత్యేక ఆకర్షణీయంగా ఉందన్నారు. సాయంత్రం 3 నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహించే ఎగ్జిబిషన్‌ను నగర శివారు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డబిల్‌పూర్‌లో బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం



మేడ్చల్: మేడ్చల్ మండలం డబిల్‌పూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ కాజ మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. బీఆర్‌ఎస్ మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మేడ్చల్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ఉపసర్పంచ్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ అశోక్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం



గుండ్లపోచంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు,నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి గెలుపే లక్ష్యంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలటీలో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి కౌన్సిలర్లు, నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించగా గ్రామాల్లో సర్పంచులు పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారు.

గోశాలను సందర్శించిన అమెరికా విద్యార్థులు



సంచార వాహనాల వద్ద అమెరికా విస్కానిక్స్ యూనివర్సిటీ విద్యార్థులు

మేడ్చల్: జిల్లాలో ఆరోగ్య సేవలు అందిస్తున్న సంచార వాహనాలను అమెరికాకు చెందిన విస్కానిక్స్ యూనివర్సిటీ విద్యార్థులు సందర్శించారు. మేడ్చల్, కీసర, శామీర్‌పేట్‌లోని గోశాలను సందర్శించి వాహనాల ద్వారా గోవులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ద్వారా మూగజీవాలకు రెండు వాహనాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు మేనేజర్ షేక్ జాన్ షహిద్, మేనేజర్లు రత్నం, తిరుపతి తెలిపారు.

నాయకత్వం.. ఓ కీలక సామర్థ్యం

పోచారం: విద్యార్థులు సాధించాల్సిన కీలక సామర్థ్యాల్లో నాయకత్వ లక్షణం ఒకటని ప్రముఖ వక్త పవన్ అన్నారు. యంనంపేట్‌లోని రాక్‌ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నాయకత్వ లక్షణాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ ఉపన్యసిస్తూ.. పాఠశాల దశలో నేర్చుకునే అత్యంత కీలక సామర్థ్యాల్లో ఒకటైన నాయకత్వ లక్షణంపై విద్యార్థులు దృష్టిపెట్టాలన్నారు. ఆ దిశగా విద్యార్థులను స్కూల్ యాజమాన్యం ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. పాఠశాల చైర్మన్ రామానాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం శ్రీరంజని, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రముఖ వక్త పవన్

డిగ్రీ కళాశాల ఏర్పాటు హామీ మరిచిన మంత్రి మల్లారెడ్డి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్

మేడ్చల్: మేడ్చల్‌లో పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చి గెలిచిన తర్వాత మరిచిపోయిన మంత్రి మల్లారెడ్డికి ఎన్నికలలో యువకులు, విద్యార్థులు బుద్ధి చెప్పాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. మేడ్చల్‌లో విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో మంత్రి మల్లారెడ్డి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానని యువకుల ఓట్లు వేయించుకుని వారిని మోసం చేశాడని అన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరు కాకపోతే తన సొంత భవనంలో కళాశాల నడుపుతానని హామీ ఇచ్చి మరిచిపోయాడన్నారు. అడిగితే గురుకులాలు ఉన్నాయి కదా అని సమాధానం చెబుతున్నారని అన్నారు. యువత మల్లారెడ్డిని ఓడించేందుకు ప్రచారం చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు శ్యాంరావ్, నిఖిల్, రాకేష్, కార్తీక్, అనిల్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంతోష్

లవ్ బ్రేకప్ చెప్పడంతో ప్రియురాలిపై కత్తితో దాడి

తాను కూడా పొడుచుకొని ఆత్మహత్యాయత్నం

కుషాయిగూడ: లవ్ బ్రేకప్ చెప్పడంతో ఓ ప్రియుడు ప్రియురాలిపై కత్తితో దాడికి పాల్పడి తాను కూడా కత్తితో పొడుచుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీఏఈ కాలనీకి చెందిన మెరుగు వన్ష్ (21) మౌలాలి ఎంజే కాలనీలో నివసించే యువతి (21) ఇద్దరు చిన్ననాటి మిత్రులు. ఒకే స్కూల్‌లో చదువుకున్న వారు చిన్ననాటి నుంచే స్నేహంగా ఉంటూ వస్తున్నారు. వారి స్నేహం కాస్తా ప్రేమగా మారి ప్రేమికులయ్యారు. ప్రస్తుతం వారు కీసరలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ శుక్రవారం అమ్మాయి లవ్ బ్రేకప్ చెప్పింది. దీంతో మనసులో కక్ష పెట్టుకున్న వన్ష్ ప్రియురాలిని చంపి తాను కూడా చనిపోవాలని పథకం వేసుకున్నాడు. శనివారం తన ప్రియురాలికి ఫోన్ చేసి చివరిసారిగా ఒక్కసారి మాట్లాడుకుందాం అంటూ నమ్మించి పిలిపించాడు. అలా ఇద్దరు కలిసి కారులో డీఏఈ కాలనీకి వెళ్లారు. కాలనీలో ఓ మూలన కారు పార్కు చేసి కారు అద్దాలు వేసుకొని మాట్లాడుకున్నారు. ఎందుకు బ్రేకప్ చెబుతున్నావంటూ కొద్దిసేపు వాదించుకున్నారు. ఈ క్రమంలోనే ఒక్కసారిగా కత్తి తీసి ప్రియురాలి, పొట్ట, మెడపై విచక్షణ రహితంగా పొడవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో వన్ష్ కూడా పొట్టలో పొడుచుకొని ఆత్మహత్యయత్నం చేశాడు. ఆమె కేకలు వేయడంతో గమనించిన కాలనీవాసులు, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది కారు వద్దకు వెళ్లి కారు అద్దాలు పగులగొట్టి కారు డోర్ తెరిచారు. వారిని స్థానిక ఎన్‌ఎఫ్‌సీ సంజీవని ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. ఘటనపై వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఇద్దరి ప్రాణాలకు హాని లేదన్నారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి



ఆర్‌జీకే కాలనీలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

కీసర: ఓటర్లు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని మల్కాజిగిరి డీసీపీ జానకి అన్నారు. శనివారం ఆర్‌జీకే కాలనీలో ఏసీపీ రమీందర్, కీసర సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో కీసర పోలీసులు పారామిలటరీ బలగాలతో కలిసి నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ జానకి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్, పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశానుసారం అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఈ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

ఎన్నికల వ్యయంపై పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చు


సాక్షి, మేడ్చల్ జిల్లా: ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎవరైనా ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకుల వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లాలోని మేడ్చల్, ఉప్పల్, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా ప్రేమ్‌ప్రకాశ్ మీనా(ఫోన్: 73370 47773), కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులు బాలా సాహెబ్‌బాపూరావు(ఫోన్: 73370 47774)కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

విశ్వరూప మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



మేడ్చల్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించే విశ్వరూప మహాసభ వాల్ పోస్టర్ మేడ్చల్ ఎమ్మార్పీఎస్ నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. మహాసభకు మాదిగలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పరశురాం, బాలనర్సింహ, రమేష్‌బాబు, స్వామి, రామకృష్ణ, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

యమహా ట్రాక్ డే ఈవెంట్



ట్రాక్ డేలో పాల్గొన్న యమహా అభిమానులు

శామీర్‌పేట్: ఇండియా యమహా మోటర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తమ వినియోగదారుల కోసం ఈ నెల 4–5 తేదీల్లో శామీర్‌పేట్ లియోనియాలోని చికెన్ సర్క్యూట్‌లో ట్రాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ది కాల్ ఆఫ్ ది బ్లూ బ్రాండ్ ప్రచారంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి 200 మంది యమహా యజమానులతో పాటు 500 మంది అభిమానులు పాల్గొన్నారు. ఉలీన్ యాంగిల్స్, హైస్పీడ్ కార్నరింగ్, బ్రేకింగ్, బాడీ మూమెంట్స్ వంటి అవకాశాలను పొందారు. యమహా తమ మోటార్ సైకిళ్ల నిజమైన సామర్థ్యాన్ని అన్‌లాక్ చేయడానికి, ట్రాక్ రైడింగ్, సాధారణ రోడ్ రైడింగ్ మధ్య తేడాలపై పరిజ్ఞానం పొందేందుకు అనుమతించింది. ఈ సందర్భంగా ఎక్సెలెన్సియా గ్రూప్ ఆఫ్ కాలేజీస్ డైరెక్టర్ వెంకట్, కేంబ్రిడ్జ్ రీజనల్ డైరెక్టర్ మహేశ్, మోలీశర్మ, స్వాతి సక్సేనా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

బోడుప్పల్: తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 8వ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విక్రం, 9వ డివిజన్ మహిళ అధ్యక్షురాలు సమతా యాదవ్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, వారు ప్రవేశపెట్టనున్న ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. పోగుల నర్సింహారెడ్డి, పొన్నం తరుణ్‌గౌడ్, బొమ్మక్ రమేష్, కిషన్‌చారి, పొన్నం రవిగౌడ్ పాల్గొన్నారు.